క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన గిద్దలూరు కమిషనర్


నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నూతన కమిషనర్‌గా ఐ.శ్రీనివాసులు సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న డి.వెంకటదాసు పదోన్నతిపై నంద్యాల అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ కాగా ఆయన స్థానంలో గుడివాడలో మున్సిపల్ మేనేజర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులును పదన్నోతిపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులును నగర పంచాయతీ అధికారులు టపావలి, ఆదిరెడ్డి, వార్డు సచివాలయాల సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

కొమరోలులో ఆధార్ స్పెషల్ డ్రైవ్

కొమరోలు: స్థానిక గ్రామ సచివాలయం–1లో సోమవారం ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ బ్రహ్మయ్య మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేది వరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. చిన్నారులకు నూతనంగా ఆధార్ కార్డులు నమోదు చేయించడంతోపాటు బయోమెట్రిక్, ఇతర వివరాలు అప్‌డేట్ చేయించుకునే వారు స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

ఈశ్వరా.. పరమేశ్వరా..

● మహా శివరాత్రికి ముస్తాబైన శివాలయాలు


కంభం : గుండ్లకమ్మ ఒడ్డున సురభేశ్వర స్వామి ఆలయం


మార్కాపురంలోని మార్కండేశ్వర స్వామి

మార్కాపురం/కంభం/బేస్తవారిపేట: శివుడు సర్వంతర్యామి. మనసారా ఓం నమఃశివాయ అంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అభిషేక ప్రియుడు, భోళా శంకరుడిగా పేరొందిన మహాశివుడిని దేవతలతోపాటు రాక్షసులు పూజించినట్లు పురాణాలు చెబుతున్నాయి. బుధవారం మహాశివరాత్రి పర్వదినం. ఈ సందర్భంగా మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని శివాలయాలు వేడుకలకు ముస్తాబయ్యాయి.

మార్కండేయ ఆలయంలో..

మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆలయంలోని శివలింగం స్వయంగా మార్కండేయ మహర్షి ప్రతిష్ఠించినట్లు పురాణాల్లో పేర్కొన్నారు. శ్రీకృష్ణ దేవరాయలు కాలంలో జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసినట్లు శాసనాలు వెల్లడిస్తున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 24 నుంచి మార్చి 5వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. 25న ధ్వజారోహణం 26న తేదీ రాత్రి ఎదుర్కోలు, గ్రామోత్సవం, తెల్లవారుజామున 4 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. 27న సాయంత్రం 6.30 గంటలకు నంది వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు. 28న గజోత్సవంపై సార్వభౌమ అలంకారం, మార్చి 1న రావణసుర వాహనంపై నటరాజ శివతాండవం, 2న భృంగీశ్వర వాహనంపై జటాఝూట మహేశ్వర, 3న సాయంత్రం 5గంటలకు రథోత్సవం, 4న శివపార్వతుల అలంకారం, పూర్ణాహుతి సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, 5న తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వివరించారు.

■ వేములకోట శివాలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు దామసాని వెంకట్రామయ్య తెలిపారు. లింగోద్భవ కాలంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. తిప్పాయపాలెంలోని మునిశ్వరస్వామి ఆలయంలో కూడా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.


బేస్తవారిపేట: ముక్తేశ్వర స్వామి ఆలయం

కనక సురభేశ్వరస్వామి ఆలయంలో..

కంభం మండలంలోని తురిమెళ్ల సమీపంలో కనక సురభేశ్వరస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. నల్లమల అడవిలో గుండ్లకమ్మ ఒడ్డున ఉన్న ఈ ఆలయాన్ని 1440లో శ్రీకృష్ణదేవరాయలు పూర్వీకులు నిర్మించినట్లు శాసనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఆలయంలో ఏటా మహా శివరాత్రి ఉత్సవాలను (కోన తిరునాళ్ల) మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. అభిషేకాలు, ధ్వజారోహణం, స్వామి వారి కళ్యాణోత్సవం, నంది వాహనంపై స్వామి వారి ఊరేగింపు ఇక్కడి ప్రత్యేకత. ఉత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. శివరాత్రి రోజున అభిషేకాలు, హోమాలు, 27వ తేదీన హోమాలు, గోగులదిన్నె వారితో నంది వాహన ఉత్సవం, కోలాటం, 28వ తేదీన నెమలి వాహన ఉత్సవం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త గోగులదిన్నె వెంగళరెడ్డి వివరించారు.

ముక్తేశ్వర ఆలయంలో..

బేస్తవారిపేట మండలంలోని ముక్తేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడి శివలింగాన్ని వశిష్ట మహర్షి ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఆలయ ధ్వజ స్తంభం దిగువన ఉన్న పుష్కరిణిని శాలివాహన శకం 1524 అంటే క్రీ.శ 1602లో నిర్మించినట్లు శిలా శాసనంలో పేర్కొన్నారు. పందిళ్లపల్లి, మోక్షగుండం గ్రామాల సమీపంలోని కొండల నడుమ కొలువైన ఈ ఆలయంలో మొత్తం ఐదు కోనేర్లు ఉన్నాయి. సంతానలేమితో బాధపడే దంపతులు ఇక్కడ శివుడిని పూజిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఏటా ముక్తేశ్వరం కోన తిరునాళ్లకు వేలాదిగా భక్తులు తరలివచ్చి శివయ్యను దర్శించుకుంటారు.

దేశ చరిత్రను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ


మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయరెడ్డి

గిద్దలూరు రూరల్: దేశ చరిత్రను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్థానిక తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతిని పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. దేశం కోసం పోరాడి ప్రాణత్యాగాలు చేసిన మహనీయులను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. మహనీయుల బాటలో నడవాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు రవీంద్రారెడ్డి, మార్కాపురం రాంభూపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్, డాక్టర్ జేపీ నారాయణ, హెల్త్ అధికారి హబీబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిధులు రూ.1.29 కోట్లు మంజూరు


తర్లుపాడులో రైతులతో కలిసి పీఎం కిసాన్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఏఓ


ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై రైతులకు అవగాహన

కొమరోలు: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా మండలంలోని 6471 మంది రైతులకు లబ్ధి చేకూరిందని మండల వ్యవసాయశాఖ అధికారి రాజశ్రీ తెలిపారు. 19వ విడతలో భాగంగా ఒక్కో రైతుకు 2 వేల రూపాయల చొప్పున నిధులు విడుదలైనట్లు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రూ.1.29 కోట్లు జమ అవుతాయని స్పష్టం చేశారు.

పొదిలిలో 8139 మంది రైతులకు..

పొదిలి రూరల్: రైతులకు పంట పెట్టుబడి సాయంగా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద సోమవారం నిధులు విడుదల చేసిందని వ్యవసాయాధికారి ఎస్‌కే జైనులాబ్దిన్ తెలిపారు. పొదిలి మండలంలో మొత్తం 8,139 మంది రైతులకు రూ.2 వేల చొప్పున రూ.1,62,78000 అందజేసినట్లు వివరించారు.

మార్కాపురం టౌన్: మార్కాపురం మండలంలోని 8,528 మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద 1.07 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కో రైతుకు వ్యవసాయ పెట్టుబడి సాయంగా రూ.2 వేల చొప్పున అందజేసిందని పేర్కొన్నారు. సోమవారం కొండేపల్లి, మాల్యవంతునిపాడు గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఏఓ పరిశీలించారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

తర్లుపాడులో.. 6,276 మంది రైతులకు..

తర్లుపాడు: మండలంలోని 6,276 మంది రైతులకు పీఎం కిసాన్ పథకం కింద 1.26 కోట్ల రూపాయల నిధులను కేంద్ర ప్రభుత్వం అందజేసిందని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ప్రధాన మంత్రి చేతుల మీదుగా పీఎం కిసాన్ నిధుల విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులతో కలిసి ఏఓ వీక్షించారు. అర్హత కలిగిన రైతులకు నగదు జమ కాకపోతే రైతు సేవా కేంద్రంలో లేదా ఏఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పొదిలి నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

పొదిలి: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి మంగళవారం నుంచి 27వ తేదీ వరకు శ్రీశైలం, రామతీర్థానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శంకర్‌రావు తెలిపారు. దర్శి, కురిచేడు, దొనకొండ, కొనకనమిట్ల, మర్రిపూడి, పొదిలి మండలాల పరిధిలోని భక్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అధిక సంఖ్యలో భక్తులు ఉంటే మండల కేంద్రాల నుంచి కూడా బస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఒత్తిడిని జయిస్తే విజయం మీదే..


గొట్లగట్టు కేజీబీవీలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


తర్లుపాడులో ఉపాధ్యాయులతో పదో తరగతి విద్యార్థులు

కొనకనమిట్ల: ప్రతి ఒక్కరికీ జీవితంలో చదువు ఒక ముఖ్యమైన భాగమని, చదువే భవితకు మూలమని, ఒత్తిడిని జయిస్తే విజయం మీదేనని గొట్లగట్టు కేజీబీవీ ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ పేర్కొన్నారు. సోమవారం కేజీబీవీలో ఇంటర్, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. ముందుగా సరస్వతీదేవి విగ్రహానికి పూజలు చేశారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే మంచి లక్షణాలు అలవర్చుకొని తోటివారిని గౌరవిస్తూ విద్యాబుద్ధులు నేర్చుకోవాలని ప్రిన్సిపాల్ హితబోధ చేశారు. ఇంటర్, పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడమే కాకుండా మంచి గ్రేడ్ సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం 9, 10, ఇంటర్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో సర్పంచ్ పి.సుఖదేవ్, పాఠశాల కమిటీ చైర్మన్ ఏదుబాటి శ్రీనివాసులు, సొసైటీ మాజీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉప్పుటూరి పెదవెంకటయ్య, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వపాఠశాల వార్షికోత్సవం

కంభం: క్రమశిక్షణ విద్యార్థికి అలంకారం లాంటిదని మండల విద్యాశాఖాధికారులు మాల్యాద్రి, శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే క్రమశిక్షణ అలవర్చుకుంటూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. పాఠశాల విద్యలో పదో తరగతి అత్యంత కీలకమైనదని చెప్పారు. పరీక్షలను ఎదుర్కొనే మెళకువలు, ఆరోగ్య సూత్రాల గురించి వివరించారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ రంజిత్ కుమార్, ఉర్దూ డీఐ మొయినుద్దీన్, పీఎంసీ చైర్మన్ రామారావు, ఉపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

టెన్త్‌లో మంచి ఉత్తీర్ణత సాధించాలి

కొమరోలు: మండలంలోని అల్లినగరం మునగనూరి వెంకటసుబ్బయ్య సన్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దాసరి గురుస్వామి మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు చక్కగా చదివి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. జీవితంలో 10వ తరగతి ప్రతి ఒక్కరికీ కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

తర్లుపాడు: పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తర్లుపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుధాకర్ ఆకాంక్షించారు. సోమవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. గత ఏడాది మాదిరిగానే నూటికి నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులంతా ఆకాంక్షించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


కంభం జెడ్పీ హైస్కూల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



అల్లినగరం హైస్కూల్లో మాట్లాడుతున్న హెచ్‌ఎం గురుస్వామి

'జార్జి'లో స్పోర్ట్స్ కార్నివాల్–2025 ఉత్సవ్


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాలేజీ సిబ్బంది

మార్కాపురం: పట్టణంలోని శామ్యూల్ జార్జి ఫార్మసి కళాశాలలో మార్చి 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఎస్‌జీఐపీఎస్ స్పోర్ట్స్ కార్నివాల్–2025 ఉత్సవ్‌లో విద్యార్థులు పాల్గొనాలని కళాశాల సెక్రటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఒక ప్రకటనలో కోరారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను కళాశాలలో సిబ్బంది సోమవారం ఆవిష్కరించారు. డివిజన్ స్థాయిలో ఫార్మసి, డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఈ స్పోర్ట్స్ కార్నివాల్‌లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్ తదితర ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 4 నుంచి 8వ తేదీ వరకు సాంస్కృతిక ఉత్సవ్ నిర్వహిస్తున్నామని, ఇందులో సింగింగ్, డ్యాన్స్, డ్రామాలు, రీల్స్ పోటీలు, గేమ్స్ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.రాజా జయరావు, సునీత, అశోక్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

శివభక్తులకు అల్పాహారం, పండ్లు పంపిణీ


వాటర్ ట్యాంకర్ వద్ద రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురం రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీశైలం వెళ్లే శివభక్తులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేయడంతో పాటు వాటర్ ట్యాంకర్‌ను కూడా సిద్ధం చేసినట్లు సంఘ అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి తెలిపారు. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు దాతలు ఎం.శ్రీనివాసరెడ్డి, సీహెచ్ సత్యనారాయణరెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎస్ అశోక్‌రెడ్డి, ఎం.వెంకటరెడ్డితోపాటు పలువురు సహకరించారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో సంఘ నాయకులు టి.రామిరెడ్డి, కె.రమణారెడ్డి, కేవీ నరసింహారెడ్డి, జి.భాస్కర్‌రెడ్డి, డి.వెంకటేశ్వరరెడ్డి, సీహెచ్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా బాగున్నాం.. నాశనం చేయొద్దు

- కూటమి హామీ ప్రకారం మెరుగైన వేతనమివ్వలేదు
- ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేట్‌కు అప్పగిస్తే కార్మికులకు నిత్య కష్టాలే..
- మార్కాపురం, పొదిలిలో మున్సిపల్ కార్మికుల ఆందోళన


ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు


పొదిలిలో కార్మికులకు పోస్టు కార్డులు అందజేస్తున్న రమేష్


మార్కాపురం టౌన్: ఆప్కాస్‌ను రద్దు చేయాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే ఖాశీం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు పారిశుధ్య కార్మికులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

సమస్యలపై సీఎంకు పోస్టు కార్డులు

పొదిలి: మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పొదిలిలో మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. సమస్యలను తెలుపుతూ పోస్టు కార్డులను సీఎం కార్యాలయానికి పోస్టు చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ఆప్కాస్ మూలంగా గత నాలుగేళ్లుగా కార్మికులు ఊపిరి పీల్చుకున్నారన్నారు. దళారీలు లేరు, ప్రతినెలా ఒకటి లేదా రెండో తేదీల్లో వేతనం ఖాతాల్లో జమ అయిందని పేర్కొన్నారు. పీఎఫ్, ఈఎస్ఐలో కార్మికుల వాటాలు జమవుతూ వస్తోందని, ఎలాంటి బెదిరింపులు కూడా లేవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మెరుగైన వేతనం ఇస్తామని నమ్మబలికి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించి కష్టాల్లోకి నెట్టాలని చూడటం దారుణమన్నారు. కార్మికుల సంక్షేమానికి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తే ఇకపై నిత్యం పోరాటాలు చేయాల్సి వస్తుందన్నారు. నగర పంచాయతీ కార్మిక యూనియన్ కార్యదర్శి బి.కోటేశ్వరమ్మ మాట్లాడుతూ.. అసలే సమస్యలు పరిష్కారం కాక కార్మికులు ఇబ్బందులు పడుతుంటే, ఆప్కాస్‌ను రద్దు చేస్తున్నట్లు లీకులివ్వడం సరికాదన్నారు. చిన్న బస్టాండ్ నుంచి పెద్ద బస్టాండ్, రథం రోడ్డు మీదుగా పోస్టాఫీసు వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.సుబ్బయ్య, కేవీ నరసింహం, వి.నాగేశ్వరరావు, పి.నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలి

గిద్దలూరు రూరల్: పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దును నిరసిస్తూ సోమవారం పట్టణంలోని పెద్ద పోస్టాఫీసు కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన చేపట్టారు. ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు పంపారు. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ.. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలను అప్పగించడం సరికాదన్నారు. కార్మికులకు అన్యాయం చేసే విధానాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు నాగయ్య, రంగయ్య, బాలయ్య, చంటయ్య, పాపయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ దంపతులను సన్మానిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

డాక్టర్ సుమయ సేవలు మరువలేనివి

గిద్దలూరు రూరల్: మండలంలోని సంజీవరాయుడుపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుమయ సేవలు మరువలేనివని వైద్య సిబ్బంది కొనియాడారు. గైనకాలజీ ఉన్నత విద్యను అభ్యసించేందుకు పదోన్నతిపై వెళ్తున్న డాక్టర్ సుమయ, ఆమె భర్త డాక్టర్ నాయబ్‌రసూల్‌ను సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది నరేష్, ఫాతిమా, సుధారాణి, రాణి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి


మృతిచెందిన వెంకట రమణ

గిద్దలూరు(బేస్తవారిపేట): మండలంలోని బురుజుపల్లిలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.వెంకట రమణ సోమవారం గుండెపోటుతో హఠాత్తుగా మృతి చెందారు. గిద్దలూరులోని స్వగృహం నుంచి పాఠశాలకు బయలుదేరుతున్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య వనజ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు వెంకట రమణ మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు.

సమస్యలు పరిష్కరించండి

● సబ్ కలెక్టర్‌కు బీజేపీ నేతల వినతి


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం: మార్కాపురంలో సమస్యలు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు సోమవారం బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలో గోవుల రక్షణ కోసం శాశ్వత పరిష్కారం ఆలోచించాలని, సప్లయ్ చానల్‌లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పట్టణంలో దోమల బెడద ఎక్కువైందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎస్సీ, బీసీ విద్యార్థులకు శాశ్వత హాస్టల్ భవనాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, పార్టీ నాయకులు ఆంజనేయులు, సతీష్, రామకృష్ణ, శివప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం


మద్యం సీసాలను సీజ్ చేసిన సీఐ

కంభం: అక్రమ మద్యం కలిగి ఉన్న బెల్టుషాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక బస్టాండ్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా బేస్తవారిపేట మండలం సలకలవీడుకు చెందిన వెంకటరత్నం 10 మద్యం సీసాలతో పట్టుబడ్డాడని చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని మద్యం సీజ్ చేశామన్నారు.